సాక్షి
వికారాబాద్
ఆదివారం । 22 । జనవరి । 2023



అర్ధాకలితో అవస్థలు

మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయి. సకాలంలో బకాయిలు అందక అవస్థలు పడుతున్నారు. 10లో▸



ప్రోత్సాహం సున్నా

అనేక ఔషధ గుణాలున్న తెల్ల కుసుమ సాగుపై రైతులు మక్కువ చూపుతున్నా ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. 13లో▸



ఊరిడిసిపోతం

జిప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే వాసన భరించలేక పోతున్నామని, వెంటనే మూసేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. 13లో▸

న్యూస్‌రీల్

శనైశ్చరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి తైలాభిషేకం చేస్తున్న అర్చకుడు

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని శనైశ్చర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. వేకువజామున 4గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమావాస్య, శనిత్రయోదశి నేపథ్యంలో భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన నల్ల నువ్వుల నూనెతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న హోమగుండం, సప్తవృక్షాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సప్త మందిరాలు, నర్మదామాత, నవగ్రహాలను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాగునీరు, పులిహోరా, అన్నదానం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు శ్రీరాంలు, అనంతయ్య తదితరులు స్వామివారిని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థుల పక్షాన పోరాడితే కేసులు పెడుతారా?

పీడీఎస్‌యూ నేత దీపక్‌రెడ్డి



పెద్దేముల్ పీఎస్ వద్ద దీపక్‌రెడ్డి

పెద్దేముల్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుత నిరసనలు చేపడితే పోలీస్ కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్‌రెడ్డి మండిపడ్డారు. పెద్దేముల్ మండలం గోట్లపల్లి మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలను తీర్చాలంటూ పది రోజుల క్రితం రోడ్డుపై ధర్నాకు దిగిన విద్యార్థులకు తాము మద్దతు తెలిపామని స్పష్టంచేశారు. దీంతో స్థానిక పీఎస్‌లో తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థులను కులం పేరుతో దూషించిన ప్రిన్సిపాల్ గాయత్రిపై ఎస్సీ, ఎస్టీ కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా విద్యార్థుల తరఫున పోరాడుతామని వెల్లడించారు. విద్యార్థులతో పెట్టుకున్న పార్టీలు, ప్రభుత్వాలు నిలబడిన దాఖలాలు చరిత్రలో లేవని హెచ్చరించారు. పేద విద్యార్థుల పక్షాన నిలబడి, న్యాయం చేయాల్సిన అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు.

కురుక్షేత్రంలో సామూహిక గీతా పారాయణం



గీతా పారాయణంలో పాల్గొన్న సభ్యులు

వికారాబాద్ అర్బన్: మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించిన కురుక్షేత్ర పుణ్యక్షేత్రం వద్ద వికారాబాద్ గీతావాహిని బృందం సామూహిక గీతా పారాయణం చేసింది. జిల్లా నుంచి సుమారు 180 మంది మహిళలు రెండు రోజుల క్రితం హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్ర ఆలయానికి వెళ్లారు. వీరిలో గీతా వాహిని సభ్యురాలు, బీజేపీ కౌన్సిలర్ శ్రీదేవిసదానంద్‌రెడ్డి, మోనిగారి లావణ్య, యాస్కి శిరీష, జయశ్రీ, వరలక్ష్మి, కరుణ, మాధురి తదితరులు ఉన్నారు. కురుక్షేత్రంలో సామూహిక పారాయణం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు.

జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం

తాండూరు రూరల్: ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉన్న కూలీలు.. ఆధార్‌కార్డుకు లింక్ చేసుకోవాలని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 33 గ్రామాల్లో కలిపి 11,800 జాబ్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. ఇందులో 9 వేలకు పైగా జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేశారని, మిగతా వారు వెంటనే లింక్ చేయించుకోవాలని సూచించారు.



రాజకీయం.. రసకందాయం

- పైలెట్ వర్సెస్ పట్నం.. సబిత పెత్తనం ఏమిటంటున్న తీగల
- మలిపెద్ది, మల్లారెడ్డికి మధ్య మంటలే.. మహేశ్వరం, తాండూరు, మేడ్చల్ నియోజకవర్గాల్లో అసమ్మతి సెగలు
- టికెట్ రాకపోతే ఫిరాయింపులకు సిద్ధం!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొత్త, పాత బీఆర్ఎస్ నేతల మధ్య తారాస్థాయికి విభేదాలు

'ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు' అనే నానుడి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయాలకు అతికినట్టు సరిపోతుంది. కొత్త, పాతల మధ్య కుదిరిన సయోధ్య చెదరడంతో భవిష్యత్తు రాజకీయం రసకందాయంగా మారనుంది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని కీలక నాయకుల అంతర్గత కుమ్ములాటలు, ధిక్కార స్వరాలు క్రమక్రమంగా రాజకీయాన్ని వేడెక్కిస్తున్నాయి. నాయకుల వైఖరి అధిష్టానానికి తలనొప్పిగా మారుతోంది.

– వికారాబాద్

- జిల్లా రాజకీయాలను శాసించే మహేశ్వరం, తాండూరు, మేడ్చల్ నియోజకవర్గాల్లో పార్టీ వ్యవహారాలు రోజురోజుకూ ముదిరి పాకాన పడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అసంతృప్తి మరింత పెరిగేలా పరిణామాలు కనిపిస్తున్నాయి. మహేశ్వరంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, తాండూరులో ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నంమహేందర్ రెడ్డి, మేడ్చల్‌లో కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మధ్య చాలాకాలంగా విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. అవి మెల్లమెల్లగా రాజుకుంటూ ఆసక్తికరంగా మారుతున్నాయి. పార్టీ ఒకటే అయినా వైరివర్గం ఆధిపత్యం మింగుడుపడక అధిష్టానంతో తాడోపేడో తేల్చుకోవాలనే భావనలో అసంతృప్త నేతలు ఉన్నారు. తమ కుటుంబ సభ్యులు జిల్లా పరిషత్ పీఠాలపై కూర్చున్నా సరే ప్రత్యర్థుల పెత్తనాన్ని ఒప్పుకొనేది లేదని తెగేసి చెబుతూ తిరుగుబాటుకు సిద్ధపడుతుండడం గమనార్హం.

పైలెట్‌తో పట్నం ఢీ

గత ఎన్నికల్లో తాండూరు నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి చేతిలో అనూహ్య ఓటమిని చవిచూశారు. తర్వాత తన సోదరుడి రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని దక్కించుకోవడంతో సంతృప్తి పడ్డారు. అనంతరం జెడ్పీ ఎన్నికలు రావడంతో సారథిగా సతీమణి సునీతను గెలిపించుకోవడం ద్వారా వికారాబాద్ జిల్లాలో తన రాజకీయ పలుకుబడి తగ్గలేదని నిరూపించుకున్నారు. అయితే, తనను ఓడించిన పైలెట్‌ను అధిష్టానం అక్కున చేర్చుకోవడంతో డీలా పడ్డారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు రెండువర్గాలు విడిపోవడంతో గులాబీ శిబిరంలో లుకలుకలు మొదలయ్యాయి. వీరి ఆధిపత్యపోరులో శ్రేణులు కూడా చీలిపోవడం.. ప్రొటోకాల్ సమస్యలతో తాండూరు రాజకీయ రంజుగా మారింది. ఎమ్మెల్యేలకు ఎర కేసుతో ప్రగతిభవన్‌కు దగ్గరయిన పైలెట్ మెడకు ఈడీ కేసు బిగుసుకుంటుందని.. తద్వారా వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమనే ధీమాలో పట్నం వర్గీయులు ఉన్నారు. రోహిత్ మాత్రం తన కెరీర్‌ను పణంగా పెట్టి బీజేపీపై కేసీఆర్‌కు పోరాటాస్త్రం అందించానని, ఈ సారి గులాబీ బీఫారం తనదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ సమీకరణలకు అనుగుణంగా అడుగువేయాలని భావిస్తున్న పట్నం అవసరమైతే కండువా మార్చయినా జిల్లా రాజకీయాలపై మళ్లీ పట్టు సాధించాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

సబిత వర్సెస్ తీగల

మహేశ్వరంలో మంత్రి సబిత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి పొసగడం లేదు. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన తీగలపై సబిత విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాలతో ఆమె కాంగ్రెస్‌ను వీడి గులాబీ గూటికి చేరి కేబినెట్‌లో బెర్త్ దక్కించుకున్నారు. అప్పటి నుంచి కినుక వహించిన కృష్ణారెడ్డి పలుమార్లు మంత్రి వ్యవహారశైలిని తప్పుబడుతూ వస్తున్నారు. అసంతృప్తిని చల్లార్చేందుకు అధిష్టానం.. ఆయన కోడలు అనితారెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్‌గా నియమించింది. దీంతో కొన్నాళ్లు గుంభనంగా వ్యవహరించిన కృష్ణారెడ్డి తిరిగి మంత్రిపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. అభివృద్ధి జరగడంలేదని,తన వర్గీయులను అణిచివేస్తున్నారని పెదవి విరుస్తున్నారు. ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. సిట్టింగ్‌ను కాదని తనకు టికెట్ ఇచ్చే అవకాశం మృగ్యమనే ప్రచారం నేపథ్యంలో పక్కపార్టీలవైపు చూస్తున్నారు.





మేడ్చల్‌లోనూ సేమ్ సీన్

2018 ఎన్నికల్లో టికెట్ నిరాకరించడంతో మిన్నకుండిన మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ఈసారి మాత్రం అధిష్టానంతో చావోరేవో తేల్చుకునేదిశగా అడుగులేస్తున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచిన చామకూర మల్లారెడ్డి అనూహ్యంగా మంత్రివర్గంలో చోటు సంపాదించారు. ఈ పరిణామం మింగుడుపడని మలిపెద్ది.. తన అనుచరవర్గాన్ని కాపాడుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే ఆయనను సంతృప్తి పరిచేందుకు కుమారుడు శరత్‌చంద్రారెడ్డికి మేడ్చల్ జెడ్పీ పీఠాన్ని అప్పగించారు. దీంతో కొన్నాళ్లపాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అయితే, సుధీర్‌రెడ్డి వర్గాన్ని టార్గెట్ చేసిన మల్లారెడ్డి.. నెమ్మదిగా అన్ని మండలాల్లో తన ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. ఈ పరిణామాలను జీర్ణించుకోని సుధీర్.. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా బరిలో దిగి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. కుటుంబీకులపై జరిగిన ఐటీ దాడులతో మంత్రి ప్రతిష్ట మసకబారిందని.. ఈసారి తనకు టికెట్ ఖాయమనే భావనలో ఉన్నారు. అధిష్టానం నుంచి రిక్తహస్తం ఎదురైతే ప్రత్యర్థి పార్టీ కండువా కప్పుకొనేందుకు కూడా వెనుకాడరనే ప్రచారం జరుగుతోంది.

క్రీడలతో మానసికోల్లాసం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్
- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు
- జట్లుగా ఏర్పడి తలపడిన న్యాయవాదులు



పోటీలను ప్రారంభించేందుకు వచ్చిన జడ్జిలతో న్యాయవాదులు

అనంతగిరి: మానసికోల్లాసం, శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్ అన్నారు. పట్టణంలోని ఎస్ఏపీ కళాశాల గ్రౌండ్‌లో శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ బార్ అసోసియేషన్ల తరఫున పలువురు న్యాయవాదులు జట్లుగా ఏర్పడి క్రికెట్ ఆడారు. పోటీలను ప్రారంభించిన అనంతరం జస్టిస్ సుదర్శన్ మాట్లాడుతూ.. ఆటల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. ఏ విషయంలోనైనా విజయం సాధించే వరకూ పోరాడాలని, చివరి క్షణం వరకూ పట్టు వీడకూడదని సూచించారు. నిత్యం కేసులు, సమస్యలతో సతమతమయ్యే న్యాయవాదులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయని స్పష్టంచేశారు. ప్రతిఒక్కరూ నిత్యం కొద్ది సమయాన్ని ఆటలు, యోగాకు కేటాయించాలని సూచించారు. ఎంత ఒత్తిడిలో ఉన్నా సహనం, ఏకాగ్రత కోల్పోవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్ పటేల్, వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.జగన్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ మహవీర్ బందయ్య, స్పోర్ట్స్ సెక్రటరీ రాజశేఖర్, సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, లవకుమార్, జనార్దన్‌రెడ్డి, బాలయ్య, వసుంధర, ఆనంద్, శ్రీనివాస్, రవి, మేఘనాథ్‌రెడ్డి, వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూరు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయంలో సీనియార్టీ జాబితాను తయారు చేస్తున్న అధికారులు

ఊపందుకున్న బదిలీల ప్రక్రియ

- టీచర్ల సీనియార్టీ జాబితాను సిద్ధం చేస్తున్న అధికారులు
- రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలకు షెడ్యూల్ వెలువడటంతో ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ ఊపందుకుంది. ముందుగా పదోన్నతులు ఇవ్వనుండటంతో ఆయా సబ్జెక్టుల వారీగా సీనియార్టీ జాబితాను తయారు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మండలాల వారీగా లిస్టును రూపొందించే పనిలో కనిపించారు. గతంలో సీనియార్టీ వివరాలను ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ జాబితాను రాష్ట్ర విద్యాశాఖ డీఈఓలకు పంపించింది. పాత జాబితా, ప్రస్తుత వివరాలను సరిచూసి ఫైనల్ లిస్టును ప్రకటించనున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కానున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వాన నీటిని ఒడిసి పట్టాలి



ఏఈఓలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఏఓ గోపాల్

- ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి
- వ్యవసాయ సహాయ సంచాలకురాలు సునీత
- ఏఈఓలకు ముగిసిన శిక్షణ

ధారూరు: నీరు, నేల యాజమాన్య పద్ధతులు, వాన నీటిని ఒడిసి పట్టడంపై రైతులకు అవగాహన కల్పించాలని వాటర్ అండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు సునీత ఏఈఓలకు సూచించారు. నీటి యాజమాన్యం, సంరక్షణపై నేషనల్ వాటర్ మిషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లాలోని ఏఈఓలకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. కేరెల్లి రైతు వేదికలో కొనసాగిన శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నీటి కుంటలు, చెక్‌డ్యాంలు వాన నీటిని ఒడిసి పట్టడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆరుతడి పంటలను పండించడం ద్వారా నీటిని సంరక్షించవచ్చని సూచించారు. వరిలో నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ మాట్లాడుతూ.. నీటి అవసరం తక్కువగా ఉంటే చిరు ధాన్యాలు, పప్పు దినుసు పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా నేల, నీటి యాజమాన్యం అవసరమన్నారు. అనంతరం డీఏఓ గోపాల్, గ్రామ సర్పంచు నర్సింహారెడ్డి ఏఈఓలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఈఓల సంఘం అధ్యక్షుడు బాలకోటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సంజూరాథోడ్, ధారూరు ఏఓ జ్యోతి, వాలంతరీ ఏఓ అన్నపూర్ణ పాల్గొన్నారు.

ముగిసిన దుకాణాల వేలం

బొంరాస్‌పేట: పోలెపల్లి ఎల్లమ్మ జాతర బ్రహ్మోత్సవాల్లో టెంకాయల విక్రయానికి నిర్వహించిన వేలాన్ని గ్రామానికి చెందిన జింకల చంద్రప్ప రూ.5లక్షల 11వేలకు దక్కించుకున్నారు. దీంతో గతేడాది కన్నా ఈసారి రూ.60వేలు అధికంగా వచ్చాయి. ఫిబ్రవరి 9నుంచి నిర్వహించనున్న జాతర బ్రహ్మోత్సవాల్లో వేలం పాటలో దుకాణాన్ని దక్కించుకున్న సదరు వ్యక్తి.. ఫిబ్రవరి 24వరకు టెంకాయలు అమ్ముకోనున్నారు. అదే విధంగా ఏడాదిపాటు నిర్వహించే కొబ్బరికాయల విక్రయాన్ని.. వేలంలో దోమ మండలం గుండాల్‌తండాకు చెందిన నరేశ్‌నాయక్ రూ.9.90లక్షలకు దక్కించుకున్నారు. గతేడాదికన్నా 3.30లక్షలు ఎక్కువగా వచ్చాయని ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్, సభ్యులు బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

26న అక్షరాభ్యాసం

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర పాఠశాలలో ఈనెల 26న సామూహిక అక్షరాభ్యాసం ఉంటుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వసంత పంచమి సందర్భంగా 26న ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 29 ఏళ్లుగా ఇది కొనసాగుతోందని, సరస్వతి దేవి పుట్టిన రోజు సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే చదువులో బాగా రాణిస్తారని తెలిపారు. అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆగని వృథా!

- కోట్‌పల్లి నుంచి దిగువకు పారుతున్న నీళ్లు
- షటర్ మెకానిక్‌లు రాకపోవడంతో కొనసాగుతున్న వరద

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు బేబీకెనాల్ తూము నుంచి నీరంతా వృథాగా పారుతోంది. శుక్రవారం షటర్‌ను దించేందుకు ఎంతగా ప్రయత్నించినా వీలు కాకపోవడంతో శనివారం మెకానిక్‌లను పిలిపిస్తామని ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్పారు. కానీ సాయంత్రం వరకూ ఎవరూ రాలేదు. కుడి, ఎడమ, బేబీకెనాల్‌ల ఆయకట్టు రైతులు పొద్దంతా ప్రాజెక్టు వద్దే నిరీక్షించారు. అధికారులు, మెకానిక్‌లు ఎవరూ రాకపోవడంతో నిరాశగా ఇంటిదారి పట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాజెక్టు నుంచి వృథాగా పారుతున్న నీళ్లను చూసి తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. అనివార్య కారణాలతో మెకానిక్‌లు రాకపోయినా కనీసం అధికారులైనా రాలేదని నాగసమందర్ గ్రామానికి చెందిన రైతు మామిళ్ల వెంకటేశం మండిపడ్డారు. 9,200 ఎకరాలకు నీరందించాల్సిన ప్రాజెక్టు నీరు ఇలా నిత్యం వృథాగా కాగ్నా నదిలో కలిసిపోతుంటే మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం దారుణమని బూర్గుగడ్డకు చెందిన పలువురు రైతులు అసహనం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు కింద సాగుచేసిన యాసంగి పంటల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టులోని నీరంతా వృథాగా పోతే నీటి తడులు ఎలా అందిస్తారని నిలదీశారు.



కోట్‌పల్లి ప్రాజెక్టు బేబీకెనాల్ నుంచి బయటకు పారుతున్న సాగునీరు

క్లుప్తంగా

స్వామివారికి పూలంగిసేవ



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. విశేష పూలతో స్వామివారికి పూలంగి సేవ నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకొని పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ధూపం, దీపం నైవేద్యాలు సమర్పించారు. పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందిస్తూ ఆశీర్వదించారు.

గడ్డివాము దగ్ధం



కాలిబూడిదైన గడ్డివాము

దోమ: గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాము దగ్ధం చేసిన ఘటన మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిమ్మాయిపల్లికి చెందిన సయ్యద్ శిరాజోద్దిన్ తన వ్యవసాయ పొలంలో పశువుల కోసం ఎనిమిది ట్రాక్టర్ల గడ్డివామును కొనుగోలు చేసి నిల్వ చేశారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో బుడిద పాలైందని వాపోయారు. గడ్డి విలువ రూ. 40 వేల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానం ఉన్న వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితుడు తెలిపారు.

మర్రి రాజిరెడ్డికి ఐక్యత అవార్డు



మర్రి రాజిరెడ్డిని సన్మానిస్తున్న మేధావులు

మర్పల్లి: మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మర్రి రాజిరెడ్డికి జాతీయ ఐక్యత అవార్డు ప్రదానం చేశారు. మర్రి రాజిరెడ్డి 25 ఏళ్లుగా సంఘ సేవకుడిగా, ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్న ఆయనను మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేసి సన్మానించారు.

అరకొర జీతాలు.. అర్ధాకలితో అవస్థలు

మధ్యాహ్న భోజన కార్మికుల వెట్టిచాకిరీ

- ఏళ్లుగా పెరగని వేతనాలు
- దుర్భరంగా మారుతున్న బతుకులు
- అమలుకు నోచుకోని ప్రభుత్వ హామీ



కట్టెల పొయ్యిపై మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికులు

పరిగి: అరకొర వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో వంటలు చేస్తూ విద్యార్థుల కడుపు నింపుతున్నా.. వారు మాత్రం అర్ధాకలితోనే జీవిస్తున్నారు. గౌరవ వేతనం 2008 నుంచి పెంచకపోవడం, ఇచ్చే వేతనం సరిపోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరికి అప్పులు చేసి విద్యార్థులకు వండి పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. కార్మికులకు కనీస వేతనాలు, ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలని కొన్నేళ్లుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వంట ఏజెన్సీల కార్మికులు వాపోతున్నారు.

269 మంది కార్మికులు

నియోజకవర్గంలో మొత్తం 269 మంది వంట కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి 15 ఏళ్లుగా ప్రతి నెల రూ.వెయ్యి చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నారు. వేతనాలు పెంచాలని ఆందోళనలు చేపడితే గత ఏప్రిల్ నుంచి రూ.3వేల వరకు గౌరవ వేతనం అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దాదాపుగా పది నెలలు కావస్తున్నా నేటికీ అమలు కావడంలేదు. మార్కెట్‌లో కూలీలకు తక్కువలో తక్కువగా రోజుకు రూ.300 వస్తుండగా మధ్యాహ్న భోజన కార్మికులకు మాత్రం ప్రభుత్వం రూ. 30 చొప్పునే చెల్లిస్తోంది. దీనికి తోడు వంట ఏజెన్సీలకు ఇస్తున్న బిల్లులు సైతం సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4.97 పైసలు, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 7.45పైసలు, 9వ, 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.9.95పైసలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుండగా నిర్వాహకులు మెనూ ప్రకారం అందజేయాల్సిందే. రోజు రోజుకు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వం చెల్లించే బిల్లులు ఏమాత్రం సరిపోవడం లేదని చెబుతున్నారు.

గుడ్డుకు మార్కెట్ కన్న తక్కువ చెల్లింపు.

వంట ఏజెన్సీల నిర్వాహకులకు అన్ని సరుకులు ఒక ఎత్తయితే గుడ్డుతో తీవ్ర నష్టం జరుగుతోంది. ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు గుడ్డును అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తుండగా మార్కెట్‌లో రూ. 6.50 అమ్ముతున్నారు. ఇక ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు గుడ్డుకు ప్రత్యేక బిల్లులు చెల్లిస్తుండగా 9వ, 10వ తరగతి విద్యార్థులకు మాత్రం రూ.9.95లోనే గుడ్డును కొనుగోలు చేయాల్సి ఉండటంతో తీవ్ర నష్టానికి గురవుతున్నామని వాపోతున్నారు.

కట్టెల పొయ్యే దిక్కు..

దోమ: మధ్యాహ్న భోజన కార్మికులకు కట్టెల పొయ్యే దిక్కవుతోంది. ఏళ్ల తరబడి కట్టెల పొయ్యి ద్వారా వంటలు చేస్తుండటంతో వాటితో వచ్చే పొగకు నిర్వాహకులు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు. మధ్యాహ్న భోజనం కోసం సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దోమ మండల వ్యాప్తంగా వ్యవసాయ భూములను రియల్టర్లు కొనుగోలు చేసుకోని చదును చేస్తుండడంతో కర్రల కొరత తీవ్రంగా ఏర్పడుతోంది. వంట చేసేందుకు కర్రల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయట మార్కెట్ నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసి వంటను తయారు చేస్తున్నామని కార్మికులు వాపోతున్నారు. సబ్సిడీ సిలిండర్లు అందించాలని పలు మార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆయా పాఠశాలల కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్సిడీ సిలిండర్లను అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

హామీ అమలు చేయాలి



ప్రభుత్వం అందించే గౌరవ వేతనం సరిపోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల గౌరవ వేతనాలను రూ.3000లకు పెంచాలి. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నాం. కష్టాలు ఎదుర్కొంటూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ప్రభుత్వం వెంటనే వంట ఏజెన్సీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

– జయమ్మ, వంట ఏజెన్సీ కార్మికురాలు, దోమ

పొగతో ఇబ్బంది పడుతున్నాం



కట్టెల పొయ్యితో వంట చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. కట్టెలు దొరకక అధిక ధరలకు కొనుగోలు చేసి వంటలను చేస్తున్నాం. వచ్చే పొగతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సైతం అవస్థలు తప్పడంలేదు. సంబంధిత అధికారులు వెంటనే సిలిండర్లను అందించేలా చర్యలు తీసుకోవాలి.

– బ్యాగరి దస్తమ్మ, కార్మికురాలు, ఐనాపూర్

ఆదేశాలు రాలేదు

మధ్యాహ్న భోజన కార్మికుల వేతన పెరుగుదల విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. ఎప్పటిమాదిరి రూ. వెయ్యి చొప్పున అందజేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అమలు చేస్తాం. వంట కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. అలాగే సబ్సిడీ సిలిండర్ల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారుల నుంచి స్పష్టత రాగానే చర్యలు తీసుకుంటాం.

– హరిశ్చందర్‌నాయక్, మండల విద్యాధికారి, పరిగి

కూతురును చూసేందుకు వెళ్తూ..

- బస్సులో ప్రయాణిస్తూ మృతిచెందిన వృద్ధురాలు
- వికారాబాద్‌లో ఘటన



బస్సులో మృతి చెందిన లక్ష్మి

అనంతగిరి: తన కూతురు ఆరోగ్యం బాగా లేదని తెలియడంతో చూసేందుకు వెళ్తున్న ఓ వృద్ధురాలు బస్సులోనే మృతి చెందింది. ఈ ఘటన శనివారం వికారాబాద్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా గొల్లపల్లికి చెందిన లక్ష్మి(65) చేవెళ్ల మండలం కొకుంట్ల అంతారం వద్ద ఉండే తన కూతురు ఆరోగ్యం బాగోలేదని తెలియడంతో ఇంటి నుంచి బయలు దేరింది. గ్రామం నుంచి మైతాబ్‌ఖాన్‌గూడ వరకు వచ్చి, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో ఎక్కి వికారాబాద్‌కు ప్రయాణమయ్యింది. వికారాబాద్ వస్తుండగా బస్సులోనే మృతి చెందింది. దీంతో బస్సు కండక్టర్ గుర్తించి మృతురాలిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కూతురు లలితకు సమాచారం ఇవ్వడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. లక్ష్మికి భర్త కూడా లేకపోగా లలిత ఒక్కతే కూతురు.

వానరానికి సపర్యలు



వానరానికి చికిత్స అందించిన సర్పంచ్ కృష్ణ

దోమ: విద్యుత్ షాక్‌తో గాయాలకు గురైన వానరానికి స్థానికులు సపర్యలు చేశారు. మండల పరిధిలోని దాదాపూర్ సమీపంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఓ వానరం తగిలి కొట్టుమిట్టాడుతోంది. స్థానికులు చూసి వెంటనే గ్రామ సర్పంచ్ కృష్ణకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న సర్పంచ్ వెంటనే తన స్నేహితుడి వాహనంలో పరిగిలోని పశువైద్యశాలకు తీసుకెళ్లారు. గాయలైన వానరానికి చికిత్స అందించడంతో తిరిగి ఫారెస్ట్ అధికారులకు అందించారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బంట్వారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, లేనట్లయితే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో బీసీలకు రాజకీయంగా కనీస ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సేకరించిన గణంకాల ప్రకారం చట్ట సభల్లో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాట లేదన్నారు. జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణాలో 119 శాసన సభ్యుల్లో బీసీలు కేవలం 21 మంది మాత్రమే ఉన్నారని ఆయన అన్నారు. దేశంలోని 244 ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్లలో ఒక్కరు కూడా బీసీ లేరన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఒక్క బీసీ జడ్జి లేకపోవడం అన్యాయమని అన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.లక్ష కోట్లతో బీసీ సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. త్వరలోనే వేలాది మందితో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని లక్ష్మణ్ యాదవ్ వివరించారు.

కంసంపల్లి(ఎం)లో కంటి శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బషీరాబాద్: కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంతట్టి ఎంపీటీసీ సభ్యుడు శ్రీధర్ సూచించారు. శనివారం కంసంపల్లి(ఎం)లో నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. పద్దెనిమిదేళ్లు దాటిన ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్, సర్పంచ్ అనురాధ, వెంకట్‌రెరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



అంజమ్మ



పూజ

మొయినాబాద్: మండలంలో వేర్వేరు చోట్ల యువతి, వివాహిత అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా మల్లేపల్లికి చెందిన బొమరెడ్డిపల్లి అంజమ్మ(45) రెండు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం మండలానికి వచ్చింది. మండలంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈనెల 17న ఉదయం ఆస్పత్రికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కొడుకు శ్రీనివాస్ అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో శనివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో చోట యువతి..

కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లా మంథోడ్ మండలం కొత్తపల్లికి చెందిన వడ్డె అమృతి, భర్త శివయ్య పదేళ్ల క్రితం మొయినాబాద్ మండలానికి వలస వచ్చారు. ఇక్కడే నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి పూజ(19) కూతురు ఉంది. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు కూలికి వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చే సరికి కూతురు కనిపించలేదు. అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో తల్లిదండ్రులు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం



భవన నిర్మాణ కార్మికులతో ఏఐటీయూసీ నాయకులు

చేవెళ్ల: అసంఘటిత కార్మికులు ఐక్యంగా పోరాటం చేసి సమస్యలు పరిష్కరించుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. రామస్వామి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణలు అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో శనివారం నిర్మాణ రంగ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పట్టించుకునేవారే కరువయ్యారన్నారు. కార్మికులకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని చెప్పారు. ప్రతి కార్మికుడు తప్పని సరిగా లేబర్‌కార్డును తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్గారి సత్తిరెడ్డి, మక్బుల్, సుధాకర్‌గౌడ్, మల్లేశ్, తిరుపతమ్మ, శ్రీను, శివ, తదితరులు ఉన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్
- అజీజ్‌నగర్ పరిధిలో 'రోడ్డు సేఫ్టీ కప్-2023' ప్రారంభం

మొయినాబాద్‌రూరల్: వాహనాదారులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని.. కుటుంబాలతో సంతోషంగా ఉంటారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలోని ఎంఆర్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో శనివారం వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో పోలీసులు, ఆర్టీఏ, సెలబ్రిటీస్‌కు రోడ్డు సేఫ్టీ కప్-2023 పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. వాహనాదారులు నిబంధనలు పాటిస్తే మరణాలు తగ్గించవచ్చని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో పోలీసులు, ఆర్టీఏ అధికారులు తలపడ్డారు. పోలీస్‌టీం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లుగా హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, వరంగల్ డీఎస్పీ ఎస్.రాంబాబు బరిలోకి దిగారు. సీవీ ఆనంద్ 21 బాల్స్‌లో 34 రన్స్ చేశారు. నాలుగు ఫోర్లు, ఒక సిక్స్‌తో ఆకట్టుకున్నారు. అనంతరం దిగిన అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ 28 బాల్స్‌లో 29 రన్స్ చేశారు. మూడు ఫోర్లు కొట్టారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్, సీసీఎస్ సంగారెడ్డి ఆర్.రవి, అంబర్‌పేట్ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఆర్గనైజర్ కన్నన్, వివేక్‌నందరెడ్డి, క్రికెట్ గ్రౌండ్ ఓనర్ రవీందర్‌రెడ్డి, పోలీసు అధికారులు, సెలబ్రిటీలు పాల్గొన్నారు.

గట్టుపల్లిలో ప్రత్యేక పూజలు

- వీరాంజనేయ స్వామికి భక్తిశ్రద్ధలతో అభిషేకం
- స్వామి సన్నిధిలో సినీనిర్మాత బెల్లంకొండ సురేశ్, నటుడు సాయి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు



బెల్లంకొండ సురేశ్, సాయి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సన్మానించిన ఆలయ ఈఓ



ప్రత్యేక అలంకరణలో గట్టుపల్లి వీరాంజనేయ స్వామి

మహేశ్వరం: మండల పరిధిలోని గట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అభిషేకాలు చేశారు. పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, తమలపాకులతో అర్చన పూజ కార్యక్రమాలు చేపట్టారు. గట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. మండలంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో సినీ నిర్మాత బెల్లంకొండ సురేశ్, సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సభ్యులు, ఈఓ ఘనంగా వారిని సన్మానించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాకేశ్‌రెడ్డి, అమీర్‌పేట్ అంజనేయ స్వామి ఆలయం పూజారి తొండుపల్లి సంతోష్ శర్మ, వీరేశం, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ దాడులు



పెట్రోల్ పంప్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం హైదరాబాద్ మార్గంలోని భారత్ పెట్రోల్ పంప్, ఇండియన్ ఆయిల్ బంకులలో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లయ్ అధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పంపులలో పెట్రోల్, డీజిల్ నాణ్యత ప్రమాణాలు, కొలతలను పరిశీలించారు. మారుతున్న రేట్‌కు అనుగుణంగా మార్పులు చేర్పులు చేస్తున్నారా, వినియోగదారులకు కల్పించే వసతులు తదితర అంశాలను ఆరా తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో తనిఖీలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే సాధారణ తనిఖీలేనని విజిలెన్స్ సీఐ రాజు తెలిపారు. ఈమేరకు శనివారం జిల్లాలో రెండు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెట్రాలజీ అధికారి జగన్‌మోహన్, సివిల్ సప్లయ్ డీటీలు తదితరులు పాల్గొన్నారు.

నాడు తండ్రి.. నేడు కుమారుడు

- ఇద్దరిని మింగిన రోడ్డు ప్రమాదం
- 55 రోజులపాటు చికిత్స అందించినా కోలుకోని బాలుడు



అఖిల్ (ఫైల్)

కడ్తాల్: రోడ్డు ప్రమాదం ఆ ఇంటిని శోకసంద్రంలో ముంచింది. గత నెల నవంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే తండ్రి మృతి చెందగా, చికిత్స పొందుతూ కుమారుడు కూడా మృతి చెందడంతో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని టాక్‌రాజ్‌గూడ తండా సమీపంలో షాద్‌నగర్-కడ్తాల్ ప్రధాన రహదారిపై గత నెల నవంబర్ 26న రాత్రి తండ్రి, కుమారుడు బైక్‌పై వెళ్తుండగా నిలిచి ఉన్న లారీని ఢీకొన్నారు. ఘటన స్థలంలోనే తండ్రి వర్త్యవత్ జగన్ మృతి చెందాడు. కుమారుడు అఖిల్(14)కు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నయంకాకపోవడంతో ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందించినా గాయాలు నయం కాకపోవడంతో మృతిచెందినట్లు ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు. 55 రోజుల వ్యవధిలోనే కొడుకును కూడా కోల్పోవడంతో తల్లి నీలమ్మ రోదనలు మిన్నంటాయి.టాక్‌రాజ్‌గూడలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ



మాట్లాడుతున్న నెట్ క్రాకర్స్ సొల్యూషన్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి

కొందుర్గు: ముట్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్ క్రాకర్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున ఎండీ శ్రీనివాస్ రూ.3 లక్షల విలువ చేసే 10 కంప్యూటర్లను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అంత కంప్యూటరీకరణ ఏర్పడిందని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల సౌకర్యానికి ఈ పాఠశాలను ఎంపిక చేసుకొని కంప్యూటర్లను అందించారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్ విద్యలో ప్రావీణ్యం సాధించాలన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గగన్‌పహాడ్ గ్రామం, సాతంరాయి గ్రామం, పుకట్‌నగర్, డ్రీమ్ అవెన్యూ, డ్రీమ్ మోనార్క్, పాశంబండ, జై భవానీ లెన్, సాతంరాయి పారిశ్రామికవాడ రోడ్డు, మీనాక్షి పేపర్ మిల్, డైమండ్ వెయిట్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నేడు నెక్నాంపూర్‌కు సోలార్‌మెన్ రాక

మణికొండ: ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సోలార్ ఎనర్జీ అంబాసిడర్, ఐఐటీ ముంబాయి ప్రొఫెసర్ సోలార్‌మెన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన చేతన్ సింగ్ సోలంకీ ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చిన్నచెరువు వద్దకు వస్తున్నారని ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరి తెలిపారు. ఉదయం 10 గంటలకు చెరువు వద్ద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించటంతో పాటు వాటికి సోలార్ వ్యవస్థ అనుసంధానంపై ఆయన సలహాలను తీసుకుంటామన్నారు. సూర్యరశ్మితో విద్యుత్ ఉత్పాదనపై ఆయన ప్రదర్శన, ఉపన్యాసం ఉంటాయన్నారు.

మర్యాదపూర్వక కలయిక

శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు, డీసీసీ అధికార ప్రతినిధి మైలారం సులోచన శనివారం గాంధీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గత నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడుతున్నాని రాబోయే ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

శంషాబాద్ రూరల్: మండలంలోని నర్కూడ శివారులో ఉన్న అమ్మపల్లి (సీతారామచంద్ర స్వామి) దేవాలయం బ్రహ్మోత్సవాలకు రావాలని నిర్వాహకులు శనివారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఫౌండర్ ట్రస్టీ ఆర్.వినోద్ కుమార్, డైరక్టర్లు, ఈఓ సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



మణికొండ: దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌కు శాశ్వత పరిష్కారం, సీపీఎస్ రద్దు, పదోన్నతులు, బదిలీలు, కేజీబీవీ టీచర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తామని టీయుటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డి అన్నారు. శనివారం ఆయన గండిపేట మండల పరిధిలోని నార్సింగి మున్సిపాలిటీ, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నిక ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర తమ యూనియన్ పోషించిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం టీయూటీఎఫ్‌తోనే సాధ్యమన్నారు.

బుద్వేల్‌లో చైన్‌స్నాచింగ్

రాజేంద్రనగర్: ఆటో దిగి నడుచుకుంటూ ఇంటికెళ్తున్న ఓ మహిళ మెడలోని మంగళ సూత్రాన్ని తెంచుకుని ఉడాయించిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బుద్వేల్ బన్సీలాల్‌నగర్ ప్రాంతానికి చెందిన వినతి (24) ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తోంది. శనివారం విధులు ముగించుకొని సాయంత్రం బుద్వేల్ చౌరస్తాలో ఆటో దిగి ఇంటికెళ్తుంది. వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన చైన్ స్నాచర్ ఆమె మెడలోని మూడుతులాల బంగారు మంగళసూత్రాన్ని తెంచుకుని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ పుటేజీను పరిశీలిస్తున్నారు.

ట్రిపుల్‌ఐటీ 'ఆర్ అండ్ డీ షోకేస్'



రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఆర్ అండ్ డీ షోకేస్–2023' అందరినీ ఆలోచింపచేసింది. శనివారం గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో విద్యార్థులు రూపొందించిన పరిశోధన పోస్టర్లు, డెమోలు, నమూనాలను ప్రదర్శించారు. 28 పరిశోధనా కేంద్రాల నుంచి 300కు పైగా ఎగ్జిబిట్లను ప్రదర్శించి వివరించారు. ముఖ్యంగా ఈ ప్రదర్శనలో డ్రోన్ల తయారీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ మాట్లాడుతూ ప్రస్తుతం సిల్వర్‌జూబ్లీ చేసుకుంటున్న తరుణంలో ఈ ఏడాది ఆర్ అండ్ డీ షోకేస్‌లో విద్యార్థుల ప్రదర్శనలకు ప్రత్యేకత ఉందన్నారు.

ఆధ్యాత్మిక ఉత్సవాలు.. భక్తుల సంబురాలు

- నేటి నుంచి ప్రారంభం
- మణికొండలో విగ్రహ ప్రతిష్ఠాపనలు
- నార్సింగిలో కల్యాణోత్సవాలు
- పుప్పాలగూడలో బీరప్ప ఉత్సవాలు

మణికొండ: గండిపేట మండల పరిధిలోని మణికొండ మున్సిపాలిటీ కేంద్రం, పుప్పాలగూడ, నార్సింగి మున్సిపాలిటీ కేంద్రాలలో ఆదివారం నుంచి ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మణికొండలో నూతన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనల కార్యక్రమం చేపట్టగా, పుప్పాలగూడలో బీరప్ప, మల్లన్న కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. నార్సింగిలో ప్రతి సంవత్సరం నిర్వహించే మల్లన్న, రేణుకా ఎల్లమ్మ కల్యాణాలు, బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దాంతో మూడు ప్రధాన గ్రామాలలోని దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు. గ్రామాలలో భక్తి పాటలు మార్మోగుతుండగా, వీధులకు తోరణాలను కట్టడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

నార్సింగిలో..

- నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం గంగ తెప్ప తేవటం, గణపతిపూజ, మల్లన్న కల్యాణం, సాయంత్రం 7గంటలకు అగ్నిగుండాలు, 8గంటలకు సొడమ్మ బోనాలు, 9గంటలకు మల్లన్న ఒగ్గుకథ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వహణ కర్త క్యాతం అశోక్ యాదవ్ తెలిపారు. సోమవారం ఉదయం 9గంటలకు నాగవల్లి, మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు రేణుకా ఎల్లమ్మ కల్యాణం, అనంతరం సాయంత్రం బోనాలు ఉంటాయని ఉత్సవ నిర్వాహకులు పిలుపునిచ్చారు.



ముస్తాబైన మల్లికార్జునస్వామి దేవాలయం

మణికొండలో..



పంచవటి కాలనీలో మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, నవగ్రహ సహిత లలితా పరమేశ్వరీ సమేత కామేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరగనున్నాయి. పూజల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు గురుప్రార్థన, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, మహాగణపతి హోమం నిర్వహించనున్నారు. ఈ నెల 26వ తేదీ వరకు ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతాయని, 24వ తేదీ మంగళవారం శ్రీ పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీ మదభినవోద్దండ విద్యా శంకర భారతి స్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

పుప్పాలగూడలో..



గ్రామంలోని మల్లన్న, బీరప్ప కల్యాణమహోత్సవాలు, ఒగ్గుకథ, బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలలో ఆదివారం ఉదయం 9గంటలకు గంపలు ఎత్తటం, మధ్యాహ్నం 12.15 లకు మల్లన్న కల్యాణం, 2 గంటలకు అగ్నిగుండాలు, సాయంత్రం 4గంటలకు మల్లన్న బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ఈనెల 26వ తేదీ వరకు కొనసాగుతాయని, బీరప్ప ఉత్సవాలు సోమవారం ఉంటాయని కమిటీ నాయకులు తెలిపారు.

ఆ ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలి

మణికొండ: నిరుపేద విద్యార్థినులు చదువుకుంటున్న నార్సింగి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో సమస్యలను వదిలేసి, నిబంధనలకు విరుద్ధంగా ఆరు సంవత్సరాలుగా ఒకే చోట పని చేస్తున్న ప్రిన్సిపాల్ కృపావరాన్ని బదిలీ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పి. శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తున్నా విద్యాలయంలో నాణ్యమైన భోజనం, విద్య, సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సౌకర్యాల పేరుతో విద్యార్థినుల తల్లితండ్రుల వద్ద చందాలు వసూలు చేస్తున్న ప్రిన్సిపాల్‌కు ఆర్‌సీఓ వత్తాసు పలుకుతున్నారని, ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే విద్యాలయం ఎదుట ఆందోళన చేపడతామన్నారు.

సమాజ సేవతోనే సంతృప్తి

అబిడ్స్: సమాజ సేవ చేసినప్పుడే మనిషి ఎంతో సంతోషంగా ఉంటాడని డీసీపీ మధుకర్ స్వామి పేర్కొన్నారు. సీతారామ్‌బాగ్‌లో లయన్స్‌క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్, సేవాభారతి, మెర్సీమెషిన్, బీఎస్‌ఎంఎస్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే మెగా ప్లాస్టిక్ సర్జరీ స్క్రీనింగ్ క్యాంపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మధుకర్ స్వామి మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు నిరంతరం సమాజ సేవకు చేస్తున్న కృషి అమోఘమన్నారు. ప్రతిఒక్కరూ సమాజ శ్రేయస్సుకు, సమాజాభివృద్ధికి కొంత మేరకైనా సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు విద్యాభూషణ్, లయన్స్‌క్లబ్ గ్రీన్‌ల్యాండ్స్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీకుమారి, రఘునాథ్‌రెడ్డి, నిహారి మండలి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: విద్యార్థులు చదువుకు ప్రాధాన్యమిస్తూ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్ కుమారి వీర్లపల్లి నందిత పేర్కొన్నారు. ప్రధాని పిలుపు మేరకు పరీక్షా పే చర్చా కార్యక్రమంలో భాగంగా శనివారం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎగ్జాం వారియర్స్ ఆర్ట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించగా మొదటి బహుమతి సంతోష్, 2వ బహుమతి శివకుమార్, 3వ బహుమతి జ్ఞానేశ్వర్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో పాలుపంచుకున్నప్పుడే విజ్ఞానం పెరుగుతుందన్నారు. తమ లక్ష్యాలు ఎంత ఉన్నతంగా ఉంటే అంత ఉన్నత శిఖరాలకు చేరుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, జిల్లా బీజేపీ కార్యదర్శి ఎం.కొమురయ్య, అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్‌యాదవ్, జిల్లా బీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యదర్శి హరికిషన్, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు టి.మల్లేష్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి!

కమిషనర్‌కు కౌన్సిలర్ల లేఖ

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని వార్డులలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని ఏకంగా కౌన్సిలర్లే మున్సిపల్ కార్యాలయంలో లేఖను అందజేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో భూముల ధరలు పెరగడంతో బడా బిల్డర్లే నిర్మాణాలు చేస్తున్నారు. పెరిగిన భూముల ధరలకు ఏమాత్రం వర్కవుట్ కావటం లేదనే కారణం, ప్రభుత్వం ఇచ్చిన టీడీఆర్ సడలింపులతో అధిక అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారు. మరికొన్ని చోట్ల అవేమి లేకుండానే అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. వాటికి కొన్ని చోట్ల కౌన్సిలర్లు, మరికొన్ని చోట్ల అధికారులు, చైర్ పర్సన్లు వత్తాసు పలుకుతున్నారు. అవన్నీ అలా ఉండగా ఇప్పటి నుంచి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని, లేదంటే వచ్చే మున్సిపల్ సమావేశంలో అధికారులపై చర్యలు తీసుకోవాలనే తీర్మాణం చేస్తామని శనివారం కొందరు కౌన్సిలర్లు పేర్కొన్నారు.

రెండు రోజుల్లోనే అధికారి వెనక్కి..

- రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం ఉండే నార్సింగి మున్సిపాలిటీకి కొన్ని సంవత్సరాలుగా ఓ టౌన్ ప్లానింగ్ అధికారి పని చేశారు. ఉన్న ఫలంగా అతన్ని తప్పించి వారం రోజుల క్రితం మరో అధికారిని నియమించారు. అతను వచ్చి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపే క్రమంలో ఒక రోజు గొలిదొడ్డిలో కూల్చివేతలు చేపట్టారు. దాంతో ఆ మరుసటి రోజే అతన్ని నార్సింగి నుంచి తప్పించటం, ప్రస్తుతం ఆ విభాగానికి అధికారే లేకపోవటం తీవ్ర చర్చానీయాంశమైంది. శనివారం కౌన్సిలర్లంతా కలిసి వైస్ చైర్మెన్‌తో పాటు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని లేఖను అందజేయటం హాట్ టాపిక్‌గా మారింది.


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ : మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంకు చెందిన 16 మంది లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. సంక్షేమమే ధ్యేయంగా సీఎం ముందుకు సాగుతున్నారని తెలిపారు. మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డివిజన్ల అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, గౌతమ్‌గౌడ్, నాయకులు గోపాల్‌రావు, వెంకటేష్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసం.. కన్వర్వేషన్



పట్టణంలోని మల్లికా కన్వెన్షన్‌లో సీడీకే గ్లోబల్ సంస్థ నిర్వహించిన 2023 కన్వర్వేషన్ శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. సంస్థ ఉద్యోగులు, సిబ్బంది కుటుంబ సభ్యులంతా ఒకే వేదికపై చేరి సందడి చేశారు. సంస్థ సభ్యులందరు ఒకే కుటుంబంగా ఉండేందుకు సీడీకే గ్లోబల్ కృషి చేస్తోందని సంస్థ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరక్టర్ అరవింద్ చతుర్వేది అన్నారు. ఈ సందర్భంగా ర్యాంప్ వాక్, రెట్రో టూ మెట్రో గీతాలు అలరించాయి.

–శంషాబాద్

కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు

శంషాబాద్: జూదం ఆడొద్దని భార్య వారించడంతో ఓ వ్యక్తి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని గుడిసెల్లో భార్యభర్తలు సరోజ, కల్యాణ్ నివాసముంటున్నారు. కల్యాణ్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో తరచూ జూదం ఆడుతున్న విషయమై భార్య వారించింది. ఈ విషయమై ఇద్దరు జాతీయ రహదారి గుండా నడుచుకుంటూ వెళ్తూ గొడవ పడ్డారు. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ సమీపంలోని రాగానే కల్యాణ్ ఒంటిపై కిరోసిన్ పోసుకోవడంతో భార్య పెద్దగా కేకలు వేసింది.అక్కడే ఉన్న పోలీసులు అతడిని అడ్డుకుని ఒంటిపై నీళ్లు వేసి శుభ్రం చేయించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

ట్రాఫిక్ ఎస్‌ఐపై చిందులు.. విలేకరిపై కేసు

శంషాబాద్: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఎస్‌ఐపై చిందులేసిన ఓ విలేకరిపై కేసు నమోదైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని సిద్ధాంతి వద్ద శనివారం మధ్యాహ్నం ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది వాహనాలు తనిఖీ స్తున్నారు. అదే సమయంలో నందిగామకు చెందిన కృష్ణ (35)ను ఆపి తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో జరిమానా విధిస్తున్న పోలీసులపై విలేకరినైన నన్నే ఆపుతావా అంటూ బూతులు తిట్టాడు. ఓ పత్రిక విలేకరినంటూ కార్డును చూపించాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల వార్షికోత్సవ ఉత్సవాలు సుధీ–2023, శృతి–2023 ఉత్సవాల వాల్‌పోస్టర్లను శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31, ఫిబ్రవరి 1న విద్యార్థులకు జాతీయ స్థాయిలో శాస్త్ర, సాంకేతిక, మేనేజ్‌మెంట్ రంగాలలో పోటీల కార్యక్రమం సుధీ–23,అదే పద్ధతిలో క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల కార్యక్రమం శృతి–23ను ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు నిర్వహిస్తున్నామన్నారు. వీటిల్లో కళాశాలలోని అన్ని విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు భాగస్వాములు కావటంతో పాటు ఇతర కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు. రెండు కార్యక్రమాల నిర్వహణకు కమిటీలను ఎన్నుకుని ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి

హిమాయత్‌నగర్: దేశంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మత ఛాందస పోకడలను అనుసరిస్తోందని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై ఆరోపించారు. మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రధాని హిందుత్వ అజెండాను దేశంపై రుద్దడానికి కుయక్తులు పన్నుతున్నారన్నారు. కేవలం పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు అనుకూలించే విధానాలనే అవలంభిస్తున్నారే తప్ప దేశ యువతకు అవసరమైన విధానాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో 45 లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయని, యువతకు ఉపాధి కల్పించకుండా దేశ ప్రగతి సాధ్యం కాదన్నారు. రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పోలీసు పరీక్షల్లో అభ్యర్థులకు జరిగిన అన్యాయం పై సమగ్ర విచారణ జరిపించాలని, అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి



ధర్నాలో పాల్గొన్న జాజుల శ్రీనివాస్ గౌడ్

కవాడిగూడ: బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయకుండా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలతో జెండాలు మోయించి ఊడిగం చేయించుకుంటున్నారని వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడం లేదన్నారు. బీసీల రిజర్వేషన్లు 27శాతం నుంచి 52 శాతానికి పెంచాలని, బీసీ కులజనగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఎస్‌పీ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఒక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా వాడుకుని ఓట్లు వేయించుకుని అనంతరం విస్మరిస్తున్నారని, బీసీలు 60శాతం జనాభా ఉన్నా రాష్ట్రంలో 25 శాతం, కేంద్రంలో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ మిగతా అన్ని వర్గాల వారికి మాత్రం జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయడంలో అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. అరశాతం ఉన్న అగ్రవర్ణాలకు కూడా ఏడు శాతం ఉంటే పదిశాతానికి రిజర్వేషన్లను పెంచిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీలు అవసరం లేదా, రాబోయే రోజుల్లో బీసీలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నిరాహార దీక్షకు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రుద్రవరం సునీల్ అధ్యక్షత వహించగా నాయకులు దాసరి ఉప, జక్కని, సంజయ్, శ్యామ్‌సన్, మహ్మద్ షఫీ, అరుణ క్వీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తోడ్పాటునందిస్తాం



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తమ వంతు తోడ్పాటునందిస్తామని మణికొండ వీఫర్‌యు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బాపూజీ, ప్రధాన కార్యదర్శి సీతారాందాస్ అన్నారు. శనివారం మణికొండ ఉన్నత పాఠశాల ఆవరణలో 1–5వ తరగతి వారికి చిత్రలేఖనం, 6 – 9 విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో దాగి ఉండే సృజనాత్మకతను ఇలాంటి కార్యక్రమాలతో వెలికి తీయవచ్చన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు.

అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: సమావేశాల్లో సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. శనివారం ఎంపీపీ జయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని 27 పంచాయతీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

- గ్రామాల్లో మంచి నీటి సరఫరా, కరెంటు సమస్యలపై సభ్యులు సమావేశంలో ఏకరవు పెట్టారు. ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న హమీదుల్లానగర్, రషీద్‌గూడ, బహదూర్‌గూడ, పోశెట్టిగూడ, చిన్నగోల్కొండలో నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.
- పిల్లోనిగూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కరెంటు తీగల కారణంగా కొత్త భవనం నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచు బుచ్చమ్మ తెలిపారు.
- ముచ్చింతల్, రామంజాపూర్, అలీకోల్‌తండాల్లో ఇళ్లపై నుంచి వేలాడుతున్న కరెంటు తీగలు, పంట పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగలను సరి చేయాలని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- రామంజాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.
- ఉదయం 11 గంటలకు సమావేశం మొదలు కావాల్సి ఉండగా.12 గంటలకు ఎమ్మెల్యే రావడంతో సభను ప్రారంభించారు. ఈ సమావేశానికి చాలా మంది ఎంపీటీసీ సభ్యులు, సగానికి పైగా సర్పంచులు డుమ్మా కొట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తన్వీరాజు, వైఎస్ ఎంపీపీ నీలం, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు ఇందిరా, క్రాంతికుమార్, యాదయ్యగౌడ్, గౌతమి, సంగీత, సర్పంచులు మాధవి, కల్పన, రాజ్‌కుమార్, లక్ష్మయ్య, సతీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'కట్లపూల దడి' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చందర్, అల్లం నారాయణ, జూలూరు గౌరీశంకర్


గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పుడమి సాహితీవేదిక ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత్రి తుమ్మల కల్పనారెడ్డి రచించిన కట్లపూల దడి పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కె.చందర్ మాట్లాడుతూ..సమాజంలోని నేటి పరిస్థితులను రచయిత్రి అందరికి అర్థమయ్యేలా సరళమైన భాషలో రచించారని కొనియాడారు. తెలంగాణ ప్రెస్ అకాడమి ఛైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. చిన్న చిన్న వస్తువులను ప్రామాణికంగా తీసుకుని ఎన్నో అద్భుతమైన రచనలు చేయడం ప్రశంసనీయమన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. నేటితరాన్ని కవిత్వం, రచనలలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం ఛైర్మన్ మంత్రి శ్రీదేవి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రచయిత్ర నాళ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు.

కేలెండర్ ఆవిష్కరణ


ఆల్‌మేవా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

సిటీబ్యూరో: తెలంగాణ ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, కేలెండర్‌ను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. శనివారం మంత్రుల నివాస సముదాయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మైనారిటీ ఉద్యోగుల సంక్షేమానికి, ఉర్దూ భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు ఈ కార్యక్రమంలో ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారూఖ్ హుస్సేన్, ఉపాధ్యక్షులు డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వహీద్ షా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

జోమా...హంగామా...



సిటీబ్యూరో: ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో తన ఫుడ్ కార్నివాల్‌ను జోమో ల్యాండ్‌ను శనివారం సందడిగా ప్రారంభించింది. శంషాబాద్‌లోని జీఎమ్‌ఆర్ ఎరీనాలో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి భోజన, వినోద ప్రియులు భారీగా హాజరయ్యారు. అంతర్జాతీయంగా పేరొందిన ఫుడ్ బ్రాండ్స్‌తో పాటు నగరానికి చెందిన 60పైగా రెస్టారెంట్స్ ఈ విందు వినోదాల సందడిలో పాల్గొన్నాయి. ఆటలు, పాటలు తదితర వినోద కార్యక్రమాల కోసం తరలివచ్చిన కళాకారుల్లో కింగ్, అనువ్ జైన్, జైడెన్, రాహుల్ దువా, గౌరవ్ కపూర్, ది ఎల్లో డైరీ, దీక్షాత్‌తో సహా జాతీయ స్థాయిలో పేరొందిన టాప్ ఆర్టిస్టులు అలరిస్తున్నారు. వీరి ప్రదర్శనలు వరుసగా జరుగుతూ అతిథుల్ని అలరిస్తున్నాయి. ఈ ఈవెంట్ 2 రోజుల పాటు కొనసాగుతుంది.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


సతీష్(ఫైల్)

సికింద్రాబాద్: కళాశాలకు డుమ్మా కొట్టిన విషయం తల్లిదండ్రులకు తెలియడంతో మనస్థాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బొల్లారం డౌటన్‌బజార్‌కు చెందిన కే.సుభాష్ కుమారుడు సతీష్(20) అల్వాల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. 10 రోజులుగా ఇంటి నుంచి బయటకు వెళ్లి కళాశాలకు వెళ్లడం లేదు. దీంతో ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. తల్లిదండ్రులు సతీష్‌కు నచ్చజెప్పి కళాశాలకు పంపించే ప్రయత్నం చేశారు. కళాశాలకు వెళ్తున్నానని చెప్పి కొంత డబ్బు తీసుకుని నేరుగా అల్వాల్-బొల్లారం రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాల వద్దకు చేరుకున్నాడు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు.

టాస్క్ పేరిట వల

- సామాజిక మాధ్యమాలలో ఆదాయం పేరిట మెసేజ్‌లు..
- పెట్టుబడికి రెట్టింపు లాభాలొస్తాయని వల
- గృహిణులు, ఐటీ ఉద్యోగులే లక్ష్యం



సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పరిధిలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ ఐటీ ఉద్యోగి. కరోనా కారణంగా మొదలైన మూన్‌లైటింగ్‌తో ఒకే సమయంలో రెండేసి ఉద్యోగాలు చేస్తున్నాడు. నెల తిరగ్గానే డబుల్ వేతనం వస్తున్నా.. అతనిలో అత్యాశ తగ్గలేదు. ఓ రోజు తన సెల్‌ఫోన్‌కు టాస్క్ పూర్తి చేస్తే పెట్టిన పెట్టుబడికి రెండింతల లాభం వస్తుందని ఓ సందేశం వచ్చింది. అంతే వెంటనే ఆ మెసేజ్‌లోని లింక్‌ను క్లిక్ చేయగానే టెలిగ్రాం గ్రూప్‌లోకి ఎంటరయ్యాడు. అప్పటికే ఆ గ్రూప్‌లో ఉన్న కొందరు సభ్యులు తాము పెట్టిన పెట్టుబడికి మంచి లాభాలు వస్తున్నాయంటూ మెసేజ్‌లు పెట్టడం చూసి తనకూ ఆశ పుట్టింది. ఇంకేముంది ఇన్వెస్ట్‌మెంట్స్ మొదలు పెట్టాడు.. రెండ్రోజులు తిరక్కుండానే తన ఖాతాలోని రూ.61 లక్షలు సమర్పించుకున్నాడు. తీరా చూస్తే మోసపోయానని గ్రహించి రాచకొండ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా.. కొందరికి చెవికెక్కడం లేదు. తొందరపాటు, అత్యాశ కారణంగా సైబర్ నేరస్తుల చేతిలో నిలువెల్లా మోసపోయి లబోదిబోమంటున్నారు. అందివచ్చే ప్రతీ ఒక్క అవకాశాన్ని సైబర్ నేరస్తులు వంద శాతం వినియోగించుకుంటున్నారు.

రివ్యూలు రాయాలంటూ...

యూట్యూబ్ లైక్‌లు, షేర్లు చేయాలని, సినిమాలకు రివ్యూలు రాయాలంటూ రకరకాలుగా సైబర్ నేరస్తులు టాస్క్‌లు ఇస్తారు. అవి చేస్తే మీరు రూ.వెయ్యి పెట్టుబడి పెడితే రూ.500 కమీషన్‌తో రూ.1,500 మీ ఖాతాలో జమ అవుతాయని చెబుతారు. తొలుత బాధితులను నమ్మించేందుకు ఒకట్రెండు సందర్భాలలో కమీషన్ ఠంచనుగా వేస్తారు. ఎప్పుడైతే మీరు లక్షల్లో పెట్టుబడి పెడతారో అప్పుడిక కమీషన్ వేయరు. ఒకవేళ వేసినా ఆయా నగదును ఉపసంహరించుకోలేరు. కేవలం స్క్రీన్ మీద మీ ఖాతాలో డబ్బు ఉన్నట్లు కనిపిస్తుందంతే. వాటిని డ్రా చేసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆదాయ పన్ను, జీఎస్టీ కట్టాలంటూ నమ్మించి సైబర్ నేరస్తులు పనికానిచ్చేసి కామ్‌గా మాయమైపోతారు.

లాగిన్ అయ్యారో అంతే..



సైబర్ నేరస్తులు పంపించే మెసేజ్‌లలోని లింక్‌లను క్లిక్ చేసి మన వ్యక్తిగత వివరాలతో లాగిన్ అవగానే ఆయా వివరాలన్నీ సైబర్ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతాయి. టాస్క్‌లతో వచ్చిన మన ఖాతాలోని డబ్బును ఉపసంహరించుకునే అవకాశం లేకుండా పన్నులు కట్టాలంటూ మోసం చేస్తుంటారు. ఇలా టాస్క్ పేరిట బాధితులను మోసం చేస్తున్న కేసులు ఈమధ్య కాలంలో పెరుగుతున్నాయి.

– జే నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్, సైబర్‌క్రైమ్, రాచకొండ

సిటీ కళాశాల విద్యార్థులు లేని రంగమే లేదు

కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్


ముగింపు సదస్సులో మాట్లాడుతున్న కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్

చార్మినార్: పూర్వ విద్యార్థులనగానే కేవలం ఆర్థిక కోణంలోనే చూడకుండా విద్యార్థుల్లో జ్ఞాన వనరులను అభివృద్ధి చేసే విధంగా వారి నుండి సేవలను అందుకోవాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ అన్నారు. కళాశాల అల్యూమినీ కమిటీ, ఐక్యూఏసీ సంయుక్తంగా 'నూతన విద్యా విధానం 2020–ఉన్నత విద్యా సంస్థలలో స్థిరమైన శ్రేష్ఠత సాధనలో పూర్వ విద్యార్థుల పాత్ర–అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకులుగా, జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కౌన్సిలర్లుగా దోహదపడాలన్నారు. పూర్వ విద్యార్థులకు తాము చదువుకున్న కళాశాలతో భావోద్వేగమైన అనుబంధంతో పాటు కొత్త తరం విద్యార్థులకు ఎదుగుదలకు చేయూతనందించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన పూర్వ విద్యార్థులను గౌరవ అధ్యాపకులుగా నియమించి తద్వారా విద్యార్థుల్లో బోధన, పరిశోధనల్లో ఆసక్తి కలిగించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. గతంలో దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో విద్యార్థులు ఎక్కువగా విదేశాలకు వెళ్లాలనే మోజు ఉండేదని... ప్రస్తుతం మాత్రం విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా రూపొందించి పలువురికి ఉపాధి కల్పించాలని భావిస్తున్నారన్నారు. పీహెచ్‌డీ వంటి విద్యార్హతలతో సంబంధం లేకుండా వ్యక్తిగతమైన ప్రావీణ్యం ప్రాతిపదికన సమాజంలోని వివిధ రంగాల్లోని నిష్ణాతులను విద్యా సంస్థలలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీసెస్‌గా నియమించాలన్నారు. దేశ, విదేశాల్లో సిటీ కళాశాల విద్యార్థులు లేని రంగమే లేదన్నారు. కార్యక్రమంలో తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, సినీనటుడు తీరువీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జె.నీరజా పాల్గొన్నారు.

ఉద్యమకారులతో కూడిన స్మృతివనం ఏర్పాటుకు కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల వ్యవహరిస్తున్న తీరు బాధకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్న అమరవీరుల స్థూపానికి పూజ కూడా చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రవీంద్రభారతిలో 1969 తెలంగాణ ఉద్యమకారుల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర సాధనలో తుది దశ, మలిదశ ఉద్యమ అమరవీరుల స్మృతివనం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. నాటి ఉద్యమకారులను గుర్తించి వారికి పెన్షన్ అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ్యులు రఘునందన్‌రావు మాట్లాడుతూ... రాబోయే అసెంబ్లీ సమావేశాలలో 1969 ఉద్యమకారుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1969 ఉద్యమకారుల రాష్ట్ర సమితి సలహాదారులు, మాజీ మంత్రి మంచినేని కిషన్‌రావు రాష్ట్ర అధ్యక్షుడు చక్రధరహరి రామరాజు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్టులో ఇరుక్కొని యువకుడు మృతి


షేక్ జుబేర్ మృతదేహం

బన్సీలాల్‌పేట్: లిఫ్టులో ఇరుక్కొని ఓ యువకుడు మరణించిన సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ జీవన్‌రెడ్డి తెలిపిన మేరకు.. బన్సీలాల్‌పేట్ ప్రాంతానికి చెందిన షేక్ జుబేర్(25) లిఫ్టులో ఇరుక్కొని మరణించాడు. మృతుడు కొంత కాలం నుంచి బన్సీలాల్‌పేట్ అరుణ్‌జ్యోతి కాలనీలో ఉన్న బాలాజీ సింగ్ ఎలక్ట్రికల్స్ గోడౌన్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం లిఫ్టులో ఓ మోటార్‌ను రెండవ అంతస్తు నుంచి కిందికి తీసుకువస్తున్నాడు. అయితే లిఫ్టు ఉన్నట్టుండి ఆగిపోయింది. దీంతో జుబేర్ తలను బయటకు పెట్టి లిఫ్టు ఆగిన సమాచారాన్ని ఇస్తున్నాడు. వెనువెంటనే లిఫ్టు ఆన్ కావడంతో జుబేర్ లిఫ్టులో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలకు గురయ్యాడు. సిబ్బంది వచ్చి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారని ఎస్ఐ జీవన్‌రెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ ఆసుపత్రికి వెళ్లారు. గోడౌన్‌లో సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. మృతుడి సోదరుడు నదీమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు


వినోద్‌కుమార్ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: అతివేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా దాములూరు గ్రామానికి చెందిన వినోద్ కుమార్ (23) తన కుటుంబంతో కలిసి సూరారం కాలనీలో నివాసం ఉంటున్నాడు. బయటకు వెళ్లి వస్తానని తన తల్లికి చెప్పి శుక్రవారం రాత్రి తన స్నేహితులు హేమంత్ కుమార్‌తో కలిసి వాహనంపై బయటకు వెళ్లాడు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న యూ టర్న్ వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో మూసాపేట వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వీరిరువురూ కింద పడిపోయి తీవ్ర గాయాలయ్యాయి. వినోద్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా హేమంత్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతుడి వివరాలు సేకరించి గాయపడిన బాధితుడిని ఆసుపత్రికి తరలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు రవీందర్ బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బ్రోచర్ ఆవిష్కరణ

నాంపల్లి: దేశ, విదేశాల్లో పర్యటించే పర్యాటకుల కోసం సదరన్ ట్రావెల్స్ మెగా ఆఫర్లను ప్రకటించింది. ఈ మేరకు శనివారం లక్డీకాపూల్‌లోని సదరన్ ట్రావెల్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సదరన్ హాలిడే మార్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ సదరన్ ట్రావెల్స్ మెగా ఆఫర్లను వెల్లడించారు. కరోనా నేపథ్యంలో గడచిన మూడేళ్లుగా పర్యాటకులకు తీవ్ర ఇబ్బందికరమైన వాతావరణం ఉండేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో సదరన్ ట్రావెల్స్ హాలిడే మార్ట్ పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సదరన్ ట్రావెల్స్ హాలిడే మార్ట్‌ను ఈనెల 23న ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. హాలిడే మార్ట్‌కు వెళ్లలేని ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో తమ స్లాట్స్‌ను బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఆపరేషన్స్ డైరెక్టర్ రామారావు, జనరల్ మేనేజరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

29 నుంచి తెలంగాణ స్టేట్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీ

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29 తేదీ నుంచి బాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, రంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సమన్వయంతో తెలంగాణ స్టేట్ బాడ్మింటన్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కర్రెడ్ల శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 13 ఏళ్లలోపు బాలురు, బాలికలు సింగిల్స్ అండ్ డబుల్స్, 15 ఏళ్లలోపు బాలురు, బాలికలు సింగిల్స్ అండ్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 27 తేదిలోగా తమ పేర్లు ఎంట్రీ చేసుకోవాలని ఆయన కోరారు. నేషనల్ బాడ్మింటన్ చీఫ్ కోచ్, బీఏఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్ ప్రారంభిస్తారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 77889 93006 సెల్ నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నాంపల్లి: ఫిబ్రవరి 11న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు శశనివారం నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో జ్యుడిషియల్ ఆఫీసర్లు, అడ్వకేట్స్, రెప్రజెంటేటివ్స్ ఆఫ్ బ్యాంక్ అఫీషియల్స్, ఫైనాన్సియల్ ఇనిస్టిట్యూషన్స్, పోలీసులతో సమావేశమైన ఆయన ప్రసంగించారు. బ్యాంక్ అఫిషియల్స్‌కి, పార్టీలకు నోటీసులు జారీ చేసి, అధిక సంఖ్యలో ఎన్.ఐ యాక్టు, చెక్ బౌన్స్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పూర్తయ్యేలా చూడాలని కోరారు. అలాగే కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మాట్రిమోనియల్ కేసులు(కుటుంబ తగాదాలు) రాజీ కుదిర్చేలా చూడాలని చెప్పారు. ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శ్రీకుళ, చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ దుర్గా ప్రసాద్, మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

నృత్యం.. సమ్మోహనం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలో భాగంగా మాధురి విజయ్ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మూషిక వాహన, నాగేంద్రహారాయ, మహాగణపతిమ్, పలుకే బంగారామాయేనా, ముద్దుగారే యశోద తదితర అంశాలను దక్షిత, బాను, ఆరాద్య, తన్మయి, ఆరుషి ప్రదర్శించారు.



దివ్యాంగులకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

నాగోలు: దివ్యాంగులకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నాగోల్‌లోని దివ్యాంగుల భవన్‌లో చైర్మన్ గంగారం అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి -సంక్షేమానికి అనేక చట్టాలు రూపొందించినప్పటికి అవి అమలులో నోచుకోవడం లేదు అన్నారు. దివ్యాంగుల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజికి అభివృద్ధికి అనేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 5 శాతం ఉద్యోగాలను డైరెక్ట్‌గా ఇంటర్వ్యూ-రాత పరీక్ష లేకుండా భర్తీ చేయాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆయా శాఖ అధిపతులు అమలు చేయడం లేదు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుజ్జ కృష్ణ, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, కవిత, షేర్ బాషా, కనకరాజు, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులతో వైరల్ ఇన్ఫెక్షన్లు

నగరంలో పెరుగుతున్న స్టమక్ ఫ్లూ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఆసుపత్రుల్లో ఫ్లూ, వైరల్ ఇన్‌ఫెక్షన్ కేసులు పెరుగుతున్నాయి. దాదాపు 50–60 శాతం మంది రోగులు చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారిన పడుతున్నట్లు ఆసుపత్రుల రికార్డులు చెబుతున్నాయి.డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, తీవ్రమైన నీరసంతో ఆసుపత్రులకు రోగులు సందర్శిస్తున్నారు. వీరిలో దాదాపు 30–40 శాతం మంది గొంతు, మూత్రం, ఊపిరితిత్తులు ఉదరంలో బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నారు. ప్రస్తుత వైరల్ ఫీవర్ వ్యాప్తికి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులే కారణమని వైద్యులు అంటున్నారు. గత రెండు వారాలుగా తరచూ నగరంలో పగటిపూట చుర్రుమనిపించేలా ఎండ, వెచ్చని పరిస్థితులు సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు చల్లని పరిస్థితులు ఉండడంతో వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ ఆకస్మిక మార్పులకు తగినట్టుగా మారే క్రమంలో శరీరంలో రోగనిరోధకత దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల వల్ల సాధారణంగా శీతాకాలపు సమస్యలతో పాటుగా బ్రోన్కియోలిటిస్, స్ట్రెప్ థ్రోట్ లేదా గొంతు నొప్పి స్టమక్ ఫ్లూ కలిగించే రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ ఇన్ఫెక్షన్లు కూడా సిటీలో పెరుగుతున్నాయి.

రోజూ 40–50 దాకా...

నగరానికి చెందిన కన్సల్టెంట్ శిశువైద్యుడు, నియోనాటాలజిస్ట్ డాక్టర్ సందీప్ మాట్లాడుతూ, × డెంగీ, ముక్కు కారటం, టైఫాయిడ్ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లతో రోజూ దాదాపు 40–50 మంది రోగులు తన దగ్గరకు వస్తున్నారని చెప్పారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో వైరస్ వేగంగా వ్యాప్తి చెందడం వల్ల 70 శాతం అంటువ్యాధులు సంభవిస్తాయని, అయితే, మిగిలిన 30 శాతం జంక్ ఫుడ్ తీసుకోవడం, తక్కువ ద్రవపదార్థాల వినియోగం వల్ల అని ఆయన చెప్పారు. కాబట్టి ఈ సీజన్‌లో జంక్ ఫుడ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.

జాగ్రత్తలు అవసరం...

సీజనల్ అంటువ్యాధులు సాధారణంగా నాలుగు-ఐదు రోజులలో నయమవుతాయి. అయితే ఈ రకమైన వాతావరణం వల్ల గొంతు, ఊపిరితిత్తులు, మూత్రంలో బాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ల వ్యాప్తి కనిపిస్తోంది. నగరానికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ సిరి కామత్ మాట్లాడుతూ, 'గత రెండు-మూడు వారాల్లో ఎగువ శ్వాసకోశ దిగువ శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ కేసులు పెరిగాయి'' అని చెప్పారు. 'దోమ కాటుకు దూరంగా ఉండడం, సామాజిక దూరం పాటించడం, ద్రవాహారం బాగా తీసుకోవడం, పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించడం, వ్యాయామం ద్వారా రోగనిరోధక శక్తిని కాపాడుకోవడం వంటివి ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు.

ఎగ్జిబిషన్ పార్కింగ్‌లో అగ్నిప్రమాదం



గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని పార్కింగ్‌లో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అబిడ్స్ పోలీసులు తెలిపిన మేరకు..నుమాయిష్‌ను తిలకించేందుకు వచ్చినటువంటి ఓ కుటుంబం గగన్‌విహార్ వద్ద కారును పార్క్ చేసి వెళ్లారు. కొద్దిసేపటికి కారు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్నటువంటి మరో మూడు కార్లకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఎంజేమార్కెట్ రోడ్డు, నాంపల్లి స్టేషన్ రోడ్డు, అబిడ్స్, తదితర ప్రాంతాలలోభారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఈ అగ్నిప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయగా ఈ ఘటనకు సంబందించిన పూర్తి వివరాలను క్లూస్ టీమ్స్ సిబ్బంది పరిశీలించారు.


ఉలిక్కిపడ్డ నగరం...

నుమాయిష్ పార్కింగ్‌లో అగ్నిప్రమాదం జరగడంతో ఒక్కసారిగా ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదం, గతంలో ఎగ్జిబిషన్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంపై ప్రజలు చర్చించుకున్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు, అధికారులు ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఎంఎంటీఎస్ స్టేషన్లలో ఆధునిక హంగులు

- హైటెక్‌సిటీ, లింగంపల్లి, హఫీజ్‌పేట్ స్టేషన్‌లు ఎంపిక
- సికింద్రాబాద్ డివిజన్‌లో మొత్తం 20 స్టేషన్ల రీడెవలప్‌మెంట్



సాక్షి, సిటీబ్యూరో: ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లలో అత్యాధునిక హంగులు చేపట్టనున్నారు. నగరంలోని హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్, లింగంపల్లి స్టేషన్‌ల రీడెవలప్‌మెంట్‌కు ప్రణాళికలను సైతం రూపొందించారు. ఆసక్తి గల సంస్థల నుంచి ఇప్పటికే బిడ్‌లను ఆహ్వానించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కేంద్రం సికింద్రాబాద్ డివిజన్‌లోని 20 రైల్వేస్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలో ఎంఎంటీఎస్ రైళ్లతో పాటు పలు దూరప్రాంతాల రైళ్లు సైతం రాకపోకలు సాగిస్తున్న లింగంపల్లి, హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్‌లను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో డిజైనింగ్....

రైల్వేస్టేషన్‌ల పునరభివృద్ధి సాధ్యాసాధ్యాలు, డిజైనింగ్, అవసరమైన సాంకేతిక సామర్థ్యం, ఇంజనీరింగ్ అవసరాలు, మాస్టర్‌ప్లాన్‌పైన వివరణాత్మకమైన ప్రణాళికలను రూపొందించేందుకు కన్సల్టెన్సీలను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే పలు సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ నెల 27వ తేదీన బిడ్‌లను ఓపెన్ చేయనున్నారు. ఆయా సంస్థల నుంచి అందిన ప్రతిపాదనలకు అనుగుణంగా రైల్వేస్టేషన్ల పునరభివృద్ధికి రీడైజినింగ్ నమూనాను ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నగరంలో రెండు మార్గాల్లో ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఫలక్‌నుమా నుంచి సికింద్రాబాద్ మీదుగా లింగంపల్లి వరకు, ఫలక్‌నుమా నుంచి నాంపల్లి మీదుగా లింగంపల్లి వరకు రెండు రూట్‌లలో రోజుకు 78 సర్వీసుల్లో సుమారు లక్ష మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. ఇవి కాకుండా లింగంపల్లి స్టేషన్ నుంచి కాకినాడ, విజయవాడ, తదితర రూట్‌లకు మరో 5 రైళ్లు నడుస్తున్నాయి. దీంతో లింగంపల్లి, హైటెక్‌సిటీ స్టేషన్‌లకు ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు వివిధ మార్గాలను అనుసంధానం చేయడంలో హఫీజ్‌పేట్ స్టేషన్‌కు కూడా ప్రాధాన్యత ఉంది. దీంతో ఈ మూడు ఎంఎంటీఎస్ స్టేషన్‌లను దశల వారీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు.

యాదాద్రి స్టేషన్ రీడెవలమెంట్...

ఈ పథకంలో భాగంగా యాదాద్రి (రాయగిరి) రైల్వేస్టేషన్‌ను కూడా పునరభివృద్ధి చేయనున్నారు. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా సికింద్రాబాద్ నుంచి రాయగిరి వరకు లైన్‌లను విస్తరించి రైళ్లను నడపాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. గత బడ్జెట్‌లో ఈ మేరకు కేంద్రం కొన్ని నిధులను కూడా విడుదల చేసింది. కానీ రైల్వేలైన్‌ల విస్తరణకు అవసరమైన భూమి ఇంకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి లభించకపోవడంతో జాప్యం నెలకొంది. యాదాద్రి క్షేత్రం అభివృద్ధి చేసిన తరువాత భక్తుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఈ మార్గంలో ఉన్న రాయగిరి స్టేషన్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

అమృత్ భారత్ స్టేషన్‌లు ఇవే...

కేంద్రం అమృత్ భారత్ స్టేషన్స్ పథకంలో భాగంగా సికింద్రాబాద్ డివిజన్‌లో కరీంనగర్, హైటెక్ సిటీ,హఫీజ్‌పేట్, తాండూరు, వికారాబాద్, పర్లి, లింగంపల్లి, జహీరాబాద్,భద్రాచలం, మధిర, మహబూబాబాద్,వరంగల్,మంచిర్యాల– రామగుండం,పెద్దపల్లి,కాజీపేట్,జనగామ, యాదాద్రి స్టేషన్‌లను గుర్తించింది.